## అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలి

**గజ్వేల్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16, 17 వార్డుల్లో భాగమైన శివాలయం, ఆఫీసర్స్ కాలనీ పరిధిలో నూతన అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గజ్వేల్ పట్టణానికి చెందిన కేతోజి వినోద్‌చారి శనివారం సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాలయం, ఆఫీసర్స్ కాలనీలో అంగన్వాడీ కేంద్రం దగ్గరలో లేకపోవడం వల్ల గర్భవతులు, చిన్నపిల్లలు చాలా దూరం నడిచి రోడ్డు దాటి వెళ్ళాల్సి వస్తుందని పేర్కొన్నారు. కొన్ని అంగన్వాడీ సెంటర్లలో పేరు నమోదు చేసుకునేటప్పుడు తమ పరిధిలోకి రాదని చెబుతున్నారని, పేరు ఎక్కడ నమోదు చేపించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నూతన అంగన్వాడీ పెట్టడానికి కావాల్సిన అన్ని అర్హతలు, కావాల్సిన జనాభా ఉందని, వెంటనే ప్రభుత్వం నూతన అంగన్వాడీ కేంద్రం మంజూరు చేసి ప్రజలకు ఉపయోగపడేవిధంగా చేయాలని కోరారు. ఆయన వెంట కాలనీవాసులు లక్ష్మి, భావన, నవ్య, హనుమంతు, ప్రశాంత్, నవీన్, శివ, ప్రభుదాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## పటాన్‌చెరులో ప్లై ఓవర్ నిర్మించండి

**పటాన్చెరు,డిసెంబర్ 7,ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పటాన్చెరు పట్టణం లో వ్యాపారస్తులకు, స్థానికులకు నష్టం వాటిల్లకుండా ప్లై ఓవర్ నిర్మించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాదులోని ఆర్ అండ్ బి కార్యాలయంలో సీఈ మధుసూదన్ రెడ్డితో భేటీ అయ్యారు.పటాన్చెరు నియోజకవర్గం లో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మియాపూర్ నుండి పటాన్చెరు వరకు చేపడుతున్న ఆరు వరసల జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆయన తెలిపారు. విస్తరణ మూలంగా పటాన్చెరువులో వ్యాపార సంస్థలకు నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రహదారి విస్తరణ మూలంగా వ్యాపారస్తులకు, స్థానికులకు నష్టం కలగకుండా ప్లై ఓవర్ నిర్మించాలని కోరారు. స్పందించిన సీఈ మధు సూదన్‌రెడ్డి ఈ అంశాన్ని జాతీయ రోడ్ల రవాణా, రహదారుల శాఖ మంత్రి. నితిన్ గడ్కారీ దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.



ఏడుపాయల్లో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి

## ఏడుపాయల్లో ఔట్ పోస్టు ఏర్పాటు

### జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి

**పాపన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** నిండు ప్రాణాలు కాపాడుకునేందుకు ఏడుపాయలలో అవుట్ పోస్టును తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అవుట్ పోస్టు చెక్ పోస్టును ఎస్‌పి పునప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏడుపాయలకు చేరుకున్న భక్తులు తరుచూ ప్రమాదావశాస్తు ప్రతి నెల ఇద్దరు ముగ్గురు భక్తులు నీట మునిగి మృతి చెందుతున్నట్లు తన దృష్టికి రావడంతో కలత చెందానన్నారు. ఏడుపాయల్లో నీటి ప్రమాదాల నివారణపై దృష్టికి కేంద్రీకరించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. నీటి ప్రమాదాల సంఖ్య 90 శాతం మేర తగ్గాయని గుర్తు చేశారు. వనదుర్గా భవాని మాత ఆలయ పరిసరాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు 20 కిలో మీటర్లు పయనించాల్సి రావడం, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే లోపు ప్రమాదాలు జరిగిపోతున్నట్లు గుర్తించి మందిరానికి సమీపంలోనే చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాల నివారణ కొరకు బోటింగ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా గతంలో ఆలయ ఈఓ దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందిన విచారం వ్యక్తం చేశారు. బోటింగ్ ఏర్పాటు చేయాలని ఆలయ ఇఓ చంద్రశేఖర్ దృష్టికి తెచ్చారు. అవుట్ పోస్టు చెక్ పోస్టులో ఎఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్, ఇరువురు మహిళా కానిస్టేబుళ్లపాటు మర ఇరువురు కానిస్టేబుళ్ల విధులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్‌రెడ్డి, సిఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట, కొల్చారం, ఎస్‌ఐలు శ్రీనివాస్‌గౌడ్, గౌస్, ఆలయ ఇఓ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## దంచి కొట్టిన వాన.. ఆగమైన అన్నదాతలు

**న్యాల్‌కల్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి అన్నతాలు ఆగమయ్యారు. అప్పుసొప్పులు చేసి ఆరుగాలం కష్టించి పండిస్తున్న పత్రి, సోయాబీన్ పంటలు కోత దశలో ఉన్నాయి, పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ భూమిలో నుంచిచి పత్తి పంటను కోత కోసి పొలం గట్టు వద్ద భద్రపర్చుకున్నారు. శనివారం కురిసన అకాల వర్షంతో చేనులో ఉన్న పత్తి పంటతో పాటు పొలం గట్టు వద్ద ఉన్న పత్తి పంటకు సైతం నష్టం వాటిల్లింది. గతంలో కురిసిన అకాల వర్షాలతో దిగుబడి అంతంతగా ఉండటం, గిట్టుబాట ధర సైతం పెద్దగా లేకపోవడంతో తెల్లబంగారం రైతులు ఇంట్లో వెలుగునింపలేకపోతోంది. శనివారం కురిసన వర్షాలతో పత్తి రైతులు పరిస్థితి అగం అగం అయిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇదిలా ఉండగా కోత దశలో ఉన్న చెరుకు పొలంలోకి అకాలంగా కురిసిన వర్షంతో వారం రోజుల పాటు చెరుకునే నరికేందుకు అవకాశం లేకుండా పోయింది.

## మాజీ ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత

**మర్కుక్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లోని సచివాలయంలో తెలం గాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. శనివారం మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల కెసిఆర్ నివాసానికి మంత్రి పొన్నం ప్రభాకర్ చేరుకోగా మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు వంశీధర్‌రావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏర్పాటుచేసిన భోజన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరు వేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారుడు హర్కర వేణుగోపాల్, డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు తదితరులు ఉన్నారు.



కెసిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మెదక్ జిల్లా శాఖ పీఆర్టీయూ టీఎస్ సంపూర్ణ మద్ధతు తెలుపుతుందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సుంకరి కృష్ణ తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా కేంద్రంలో ఈ నెల 6, 7, 8, 9వ తేదీలలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలకు రెండవ రోజైన శనివారము మెదక్ కలెక్టరేట్ ఎదురుగా జరుగుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన దీక్షను ఉద్దేశించి పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సుంకరి కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుండి చేపట్టబోతున్న నిరవధిక సమ్మెకు పీఆర్టీయూ టీఎస్ మెదక్ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్యా నాయక్‌లు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, వెట్టి చాకిరి విధానం అమలవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విభాగంలో సుమారుగా 19,360 మంది ఉద్యోగులు పనిచేసున్నారని, ఉద్యోగులు ఏళ్ళ తరబడి పనిచేస్తున్నప్పటికీ పనికి తగిన వేతనం లభించడం లేదని, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. రిలే దీక్షలకు మద్ధతు ప్రకటిం చిన వారిలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లారెడ్డి, మెదక్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు సుభాష్ రెడ్డి, హరిబాబు, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట,డిసెంబర్ 7,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నీటి గుంత లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం ఎస్ కోండాపూర్ పరిధి గెరిల్లా తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... తండాకు చెందిన మోహన్(45) ఉదయం వ్యవసాయ పోలానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లి మధ్యాహ్నమైన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా వ్యవసాయ పోలం వద్ద నీటి నిలువ కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు మోహన్ పడి మృతి చెందాడు. ఈత రాకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని, మృతుని భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# భవిష్యత్తు బాగుండాలంటే కష్టపడి పైకి రావాలి

**-మేధాశక్తిని వృధా చేయవద్దు**
**-విద్యార్థులను మన పిల్లల్లా చూసుకోవాలి**
**మంత్రి పొన్నం ప్రభాకర్**

**వర్గల్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):** విద్యార్థులు మీ ఉజ్వల భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పటి నుండే కష్టపడి పైకి రావాలని, తమ మేధాశక్తిని వృధా చేయకుండా దానికి పని పెట్టాలని అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంకు విద్యార్థులు ఘనస్వాగతం పలుకగా క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ విభాగాలలో గెలుపొందిన విజేతలకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంనరతి పొన్నం ప్రభాకర్ బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీల్లో ఒకరోజు మొత్తం ఇక్కడే ఉండి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుందామని అనుకున్నట్లు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటి సంవత్సరం సెలబ్రేషన్స్ మీ అందరి సమక్షంలో జరుపుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల 25వేల పాఠశాలకు 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామన్నారు. 2010 నుండి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు లేవని, వారిని బదిలీచేసి అసహనం తొలగించామని, గురుకులాల్లో చల్లని నీటితో స్నానం చేయవద్దని విద్యార్థుల కోసం వాటర్ హీటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సొంత భవనాల్లో గురుకులాలు ఏర్పాటు చేస్తుందన్నారు. నాణ్యమైన ఆహారం అందించడానికి డైట్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని, డైటీషన్ సలహాతో ఎస్సీ ఎస్టీ, బిసి, మైనార్టీ గురుకుల సెక్రటరీలతో మెనూ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో గురుకులాల్లో గ్రీన్ ఛానెల్ ద్వారా మెస్ ఛార్జీలు ఇస్తామన్నారు. తల్లిదండ్రులను వదిలి వచ్చిన పిల్లలను మన పిల్లల్లాగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టామని, అట్టి కార్యక్రమాల ప్రోగ్రెస్ రిపోర్టు తెలంగాణ సమాజం ముందు ఉంచుతామన్నారు. ఇదిలా ఉండగా కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల అధ్యాపకులతో విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి



నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

# ఇండ్లు లేని నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ

**పెద్ద శంకరంపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** ఇండ్లు లేని నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిల సమక్షంలో వర్చువల్ విధానంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. మెదక్ జిల్లాలో ఇందిరమ్మ గృహాల కోసం 1 లక్ష 91 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని ఆమె తెలిపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, తమ నియోజకవర్గానికి అదనంగా ఎక్కువ గృహాలను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ఈ సందర్భంగా విన్నవించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్ధిదారుల వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్‌లో సజావుగా నమోదు చేయాలని సూచించారు. చీలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న తీరును ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ద్వారా మెదక్ జిల్లాలో 1 కోటి 60 లక్షల మంది ప్రయాణం చేశారన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్తును గృహ జ్యోతి ద్వారా ఉచితంగా కరెంటును అందించామన్నారు. మహిళ సాధికారతే లక్ష్యంగా మహిళలకు 100 కోట్ల రూపాయలతో మహిళా సంఘాలకు రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు.

**పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే...**



ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్

### నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టడం జరుగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా మహిళా సాధికారత కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో యాదయ్య, తాహశీల్దార్ గ్రేసీబాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు దానంపల్లి నారా గౌడ్, ఆర్‌ఎన్. సంతోష్ కుమార్, పెరుమాళ్ గౌడ్, విగ్రం రాజన్ గౌడ్, దాచ సంగమేశ్వర్, సుభాష్ గౌడ్, కుంట్ల రాములు, గంగారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

### జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**ములుగు, డిసెంబరు 7 ప్రభాతవార్త:** పట్టుదలతో చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శనివారం ములుగు మండలకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత పాఠశాలలో 635 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యార్థులకు సరిపడా మిషన్ భగీరథ నీళ్లు అందడంలేదని, కొత్తగా సంపు నిర్మాణం చేపట్టాలని, వీటితో పాటు బాత్రూమ్‌లు మరమ్మతు చేయాలని, ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని కోరగా స్పందించిన కలెక్టర్ ఈడబ్ల్యూఐడిసి ఏఈ వీటికి కావాల్సిన అన్నింటిని గూర్చి ఎస్టిమేట్ చేస్తారని తెలిపారు. అనంతరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఫిజిక్స్ సబ్జెక్టు మన చుట్టుపక్కల ఉన్నవాటిని చూస్తూ నేర్చుకుంటే బాగా అర్థమవుతుందని, దీనికి తోడు ఏకాగ్రతతో చదవాలని సూచించారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే పట్టుదల కావాలని, సమయాన్ని వృధా చేయవద్దని అన్నారు. ఇక్కడ వాతావరణం మనశ్శాంతితో పాటు అన్నింటికీ అనుకూలంగా ఉందని, దీనిని అనుకూలంగా మార్చుకొని ఏకాగ్రతతో చదువుకోవాలని, అలాగే ప్రశ్న, సమాధానాన్ని భిన్న కోణాలలో ఆలోచించాలని, ఏదైనా పూర్తిగా చదివినప్పుడే అడగడానికి ప్రశ్నలు, డౌట్లు వస్తాయని అప్పుడే ఉపాధ్యాయులను అడిగి మీకు కావలసిన సమాధానాన్ని రాబట్టుకొని సబ్జెక్టుపై ఎక్కువ పట్టును సాధించగలరని అన్నారు. ఆయన వెంట ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.



విద్యార్థినిలతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు : కలెక్టర్

**పెద్ద శంకరంపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చీలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పట్టణంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోని కూరగాయలు, ఆకుకూరలు, వంట సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, వండే పదార్థాలలో సరుకుల పరిమాణాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానుగుణంగా రుచికరమైన భోజనం అందించాలని, ఎక్కువ కాలం వరకు నిల్వ చేయకుండా, నాసిరకం లేకుండా సరి చూసుకోవాలన్నారు, వంట గది పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే బోధనా నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారి ప్రతిభా సామర్థ్యాలను పరీక్షించి విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తదనుగుణంగా విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పది ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ గ్రేసీబాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా, నాయకులు మధుసూదన్, దానంపల్లి నారాగౌడ్, ఆర్‌ఎన్. సంతోష్ కుమార్, పెరుమాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిఆర్‌ఎస్ నాయకులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

## కాంగ్రెస్ యేడాది పాలనలో ఎడారిగా సిద్దిపేట

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో సిద్దిపేట అభివృద్ధి పరుగులు పెట్టగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన యేడాది పాలనలో ఏడారిగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ అ పార్టీకి రాజీనామా చేసి పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హైదారాబాద్‌లోని హరీష్‌రావు స్వగృహంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీష్‌రావు బిఆర్‌ఎస్‌లో చేరిన రామకృష్ణకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేటపై కక్షసాధిస్తుందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను రద్దు చేయడంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మధ్యలోనే అపి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త అభివృద్ధి పనులు మంజూరు చేయకపోగా పాత పనులను నిలిపి వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో సిద్దిపేటలో అభివృద్ధిని కొనసాగించే వరకు నిలిపి వేసిన పనులను ప్రారంభించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, వరాల సురేష్, దరిపల్లి శ్రీనివాస్,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం.. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం

### సిపి డాక్టర్ అనురాధ




మాట్లాడుతున్న సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుదాం.. ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం సీపీ కార్యాలయం ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనవరి నుంచి ఇప్పటి వరకు రికవరీ చేసిన ప్రాపర్టీ కేసులు, ప్రజలకు అందించిన సేవలు ప్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పిల్లలకు ఆయుధాలు,పోలీసు చట్టాలు,సీసీ కెమెరాల వినియోగం,ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ తదితర అంశాలపై సీపీ స్వయంగా విద్యార్థులకు వివరించారు. అనంతరం అమె మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించడానికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. సైబర్ నేరాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు మల్లారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, మధు, కిరణ్,శ్రీధర్‌గౌడ్, అంజయ్య, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం నిర్వహించే ప్రజావాణి మంగళవారానికి వాయిదా : కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఈనెల 9న వ్యవసాయ,ఉద్యానశాఖలకు చెందిన క్రిషికల్ప, అగ్రిసినర్జీ 2024 కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న నేపథ్యంతో ఈనెల 9న సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి మంగళవారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి రాకుండా మంగళవారం నిర్వహించే ప్రజావాణికి ప్రజలు హాజరు కావాలన్నారు. మంగళవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## మహిళా అధ్యక్షురాలి సంతకం ఫోర్జరీ

### బ్యాంకు నుండి రూ. 50వేల విత్‌డ్రా

### విధుల నుండి ఆర్‌పిని తొలగించిన మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్‌రూరల్,డిసెంబరు7,ప్రభాతవార్త** మహిళా సంఘం అధ్యక్షురాలికి, సంఘం సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు నుండి రూ 50వేలు విత్‌డ్రా చేసిన ఆర్పిని విధుల నుండి మూడు నెలల తొలగించినట్లు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖా ర్జున్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.విడుదల చేసిన ప్రకటనలో హుస్నాబాద్‌లోని కెబి కాలనీకి చెందిన మెప్మ స్లమ్ సమాఖ్యలో ఆర్పిగా విధులు నిర్వహిస్తున్న గడిపె సుమలత స్లమ్ సమఖ్య అధ్యక్షురాలికి,సంఘం సభ్యులకు ఎవరికీ తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేసి చెక్ నెం 2376006 చెక్ ద్వార నవంబరు 26వ తేదీన విత్ డ్రా చేసిందని ఈ విషయం డిసెంబరు 6వ తేదీన వెలుగులోకి రావడంతో స్లమ్ సభ్యులు సమావేశం నిర్వహించుకుని తనను నిలదీయగా సంతకాలు ఫోర్జరీ చేసి 50వేలు విత్‌డ్రా చేశానని ఒప్పుకుందని, స్లమ్ సమాఖ్య ఇచ్చిన తీర్మాణం మేరకు గడిపె సుమతల తప్పును మొదటి తప్పుగా భావించి తన విధుల నుండి మూడు నెలలు తొలగిస్తున్నట్లు వివరించారు.స్లమ్ సమాఖ్య తీర్మాణం మేరకు నేటి నుండి త్రివేణి 2 సమాఖ్యలో ఆర్పిగా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వరికి అదనపు బాద్యతలు అప్పగిసించినట్లు స్పష్టం చేశారు.

## సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదుకు చివరి అవకాశం

### మున్సిపల్ కమిషన్ జ్యోతిరెడ్డి

**అమీన్ పూర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** అమీన్ పూర్ పురపాలక సంఘం పరిధిలోని అమీన్‌పూర్ పట్టణం, విలీనమైన గ్రామపంచాయతీలు, కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, ఐలాపూర్,ఐలాపూర్ తాండ, దాయర, సుల్తాన్‌పూర్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే సమయంలో అందుబాటులో లేని వారు, ఇతర కారణాల వల్ల సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు కార్యాలయ ఫోన్ నెంబర్ 9885465065, 9963640541 లలో సంప్రదించి చివరి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషన్ జ్యోతిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేకల కనకయ్య

**మర్కుక్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):**మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిని పోచయ్య గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ బిసిసెల్ అధ్యక్షుడు, సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట పెద్దబోయిని ఎల్లం, నారని మదరి, చెక్కలి నర్సింలు, మహేష్‌లు ఉన్నారు.

## గౌరారంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

**వర్గల్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):**వర్గల్ మండలంలోని గౌరారం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో శనివారం ప్రజా పాలనలో భాగంగా శ్రీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రాణి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు రామలీల, సంతోష, హంస, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి



క్రీడలను టాస్ వేసి ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి యాదగిరి

**వర్గల్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):**రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని నాచగిరి క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పేర్కొన్నారు. ప్రజా పాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయంలో శనివారం ఉదయం నవగ్రహ హోమము, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి హోమము తదితరకార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, అర్చకులు, పురోహితులు, ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు, భక్తులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో సిఎం కప్ క్రీడల నిర్వహణ

**వెల్దుర్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం సీఎం కప్ క్రీడలను నిర్వహించారు. మండల విద్యాధికారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆముద భాగ్యలక్ష్మీ ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్ కిష్టాగౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు ముక్తా బాయి, ఎన్. శేఖాగౌడ్, స్థానిక పట్టణ అధ్యక్షులు అవసర మల్లేష్, అంగడిపేట మహేందర్ గౌడ్, ఈవో బలరాం రెడ్డి, పాఠశాల పీడీ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

-గజ్వేల్ సిడిపిఓ సరిత



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ సరిత

**ములుగు, డిసెంబరు 7 (ప్రభాతవార్త):**ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు సమతుల్యంతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని గజ్వేల్ సిడిపిఓ సరిత అన్నారు. శనివారం ములుగు మండలం కొక్కొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణీలకు పలు రకాల ఆహార పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రజిత, అంగన్వాడీ నిర్వాహకులు నాగరాణి, శైలజ, నర్మద, పద్మ, అరుణలత తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి సిపిఎం రాష్ట్ర మహాసభలు

-కరపత్రాలు పంపిణి చేస్తున్న సిపిఎం నాయకులు



సిపిఎం రాష్ట్ర మహాసభలకు విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

**చౌటకూరు, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ప్రజా పోరాటాలను బలపర్చాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏటిగడ్డ లింగంపల్లిలో ఈ నె 25వ తారీఖు నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే 4వ రాష్ట్ర మహాసభలను జయవంతం చేయాలని, విరివిగా విరాళాలు అందచేయాలని సిపిఎం నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మొదటి మారు రాష్ట్ర స్థాయి మహాసభలు జరుగుతున్నాయని, అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలన్నారు. నిరుద్యోగం, పేదరికము, ధరల పెరుగుదల, ఆత్మహత్యల నివారణలన్నింటికి పరిష్కారం చూపేది ఎర్రజండా అని పేర్కొన్నారు. దేశంలో అవినీతి పోవాలన్నా, పేదరికం పోవాలన్నా, సమస్యలు పరిష్కారం కావాలన్నా ప్రత్యామ్నాయ రాజకీయాలు అవసరమని గుర్తు చేశారు. మహాసభలకు తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి 1000 మంది ప్రతినిధులు, జాతీయ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. 25న సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి అశోక్, నాయకులు గంగారాం రాజు, శ్రీహరి, సదానందం, మైపాల్, ప్రవీణ్, లింగమయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

-ఘనంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం
-విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం



శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

**వర్గల్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):**ప్రసిద్ధ వర్గల్ శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి క్షేత్రంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు తెల్లవారుజామున ఉత్సవానికి అంకురార్పణ చేయగా, అనంతరం సతీసమేతులైన శ్రీ స్వామి వారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, లక్ష పుష్పార్చన, శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి జన్మదినమైన సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా తెల్లవారుజాము నుండే భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడం కనిపించింది. కాగా సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే ఆరోగ్య సమస్యలు తొలగుతాయని, అష్టైశ్వర్యాలు సమకూరుతాయని, గ్రహ దోషాలు తొలగిపోతాయని, విశేష ఫలితాలు వస్తాయని, స్వామివారి కృపాకటాక్షాలు, సంపూర్ణ ఆశీస్సులు ఉంటాయని చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని షణ్ముఖుడు, కార్తికేయుడు, కుమారస్వామిగా భక్తులు స్థుతిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా మార్గశిర శుద్ధ షష్టిని సుబ్రహ్మణ్య షష్టిగా పేర్కొంటూ స్వామివారి జన్మదినం సందర్భంగా ఉపవాస దీక్షతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వివరించారు.

## నూతన బూత్ కమిటీల నియామకం

-మండల బిజెపి అధ్యక్షులు పాతూరి దయాకర్ గౌడ్



నూతన బూత్ కమిటీల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

**కొల్చారం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో బీజేపీ నూతన బూత్ కమిటీని శనివారం మండల పార్టీ అధ్యక్షులు పాతూరి దయాకర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో నియమించడం జరిగింది. కిష్టాపూర్ గ్రామ 1వ బూత్ అధ్యక్షులుగా సాధుల దుర్గాప్రసాద్, సెక్రటరీగా మల్కె శ్రీశైలం, లాబర్తి ప్రముఖ్‌గా పెద్ది రమేష్, వాట్సప్ ప్రముఖ్‌గా అక్కెం ప్రవీణ్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. అలాగే కిష్టాపూర్ గ్రామ 2వ బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎంబరి శేఖర్ యాదవ్, సెక్రటరీగా వడ్ల సంతోష్, లాబర్తి ప్రముఖ్‌గా నాగులగారి దుర్గగౌడ్, వాట్సప్ ప్రముఖ్‌గా సదుల సాయి రాజులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండు నాని, సీనియర్ నాయకులు ఎంచర్ల శేఖర్ యాదవ్, వడ్ల చంద్రశేఖర్, మల్కె మల్లేశం, మాజీ సర్పంచ్ పసుల నారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాదుల ఊషయ్య, గోకని మల్లేశం, అక్కెం శ్రీశైలం, కర్ర ఆంజనేయులు, సాదుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో ఆటో డ్రైవర్ల ధర్నా



ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలంటూ ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

**వెల్దుర్తి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన వెల్దుర్తిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు శనివారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల ఆందోళనకు సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భాషా గౌడ్, ఉపాధ్యక్షులు షాపుద్దీన్, ప్రవీణ్, బాలేష్, మహేష్, ప్రవీణ్ గౌడ్, గోపాల్ గౌడ్, మైపాల్, శ్రీనివాస్, శేఖర్, రాజు, శ్రీను, ప్రవీణ్, బాలు, మహేష్, రమేష్, ప్రవీణ్, అనిల్, రాము, యాదగిరి గౌడ్, శ్రీను, సంజీవ్, నరేష్, గట్టగౌడ్, మహేష్, చెర్రి, లక్ష్మణ్, షాయద్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వాసుపత్రి వద్ద అల్పాహారం, పండ్లు పంపిణీ



ప్రభుత్వాసుపత్రి వద్ద అల్పాహారం పంపిణీచేస్తున్న దృశ్యం

**గజ్వేల్‌టౌన్, డిసెంబరు 7** (ప్రభాతవార్త):గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద గజ్వేల్ యాదమ్మ నర్సయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు సాయిలు కుటుంబసభ్యులతో కలిసి అల్పాహారం, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ మా మాతృమూర్తి గజ్వేల్ యాదమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మానవసేవే మాధవసేవ అని ప్రతి ఒక్కరూ సేవానిరతి ఉండాలని అన్నారు.

## అక్రమాలకు పాల్పడితే చర్యలు



రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

**చిన్నశంకరంపేట,డిసెంబర్ 7,ప్రభాతవార్త:** పజలకు అందించే రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వేంకటేశం అన్నారు. శనివారం చిన్నశంకరంపేట పట్టణంలోని రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న బియ్యాన్ని రేషన్ డీలర్లు తప్పకుండా అందించాలని అన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం తిసుకున్నవారి వివరాలను తప్పకుండా రికార్డులలో నమోదు చేయాలన్నారు. అనంతరం బియ్యాన్ని తూకం వేసి పరిశీలించారు. ఆయన వెంట సీఐ పాండరి, ఎస్ఐ సాంబశివరావు తహసీల్దార్ ప్రభాకర్‌లు ఉన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను తహశీల్దార్‌కు అప్పగించిన బొమ్మారం గ్రామస్థులు

**వెల్దుర్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం బొమ్మారం వద్ద హల్దీ వాగు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్‌లు, ఒక హిటాచిని గ్రామస్థులు అడ్డుకొని శనివారం తహశీల్దార్ జ్ఞానజ్యోతికి అప్పగించారు. సంఘటన స్థలాన్ని తహశీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, చేగుంట పోలీసులు సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తాహశీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు. బొమ్మారం తాజా మాజీ సర్పంచ్ శంకర్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## 108 అంబులెన్స్ వాహనం మంజూరు

**వెల్దుర్తి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలానికి 108 అంబులెన్స్ వాహనం మంజూరైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఉద్దండపురం నర్సింలు, శ్రీకాంత్, నాగిరెడ్డిలు 108 అంబులెన్స్‌ను మంజూరు చేయించినందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాసాయిపేట మండలానికి 108 అంబులెన్స్ వాహనం మంజూరు కావడం పట్ల గ్రామ ఎంపీటీసీ కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## 2 లక్షల రూపాయల ఎల్‌వోసిని అందజేసిన ఎమ్మెల్యేసునితా లక్ష్మారెడ్డి



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలానికి చెందిన ఎం. ప్రవలిక అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు గాను ఆపరేషన్ నిమిత్తం మంజూరైన 2 లక్షల రూపాయల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి శనివారం నర్సాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బాధితురాలి తండ్రి యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితిగతులు బాగోలేక వైద్యం చేయించుకునే స్థోమత లేని అనేక మంది అప్పులు చేసి ఇబ్బందుల పాలవుతున్నారని, వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్, సత్యం గౌడ్, గూడూరి యాదాగౌడ్, తాజా మాజీ సర్పంచ్‌లు చంద్రకళ శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, చింత స్వామి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

**న్యాల్‌కల్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ప్రమాదావశాస్తు కరెంట్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన పోలీసుఠాణా పరిధిలోని చినిగేపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చినిగేపల్లి గ్రామానికి చెందిన చౌలా రాంరెడ్డి (49) తనకు గల వ్యవసాయ భూమిలో ఉల్లిగడ్డ పంటను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఉల్లిగడ్డ పంటకు సాగు నీరు అందించేందుకు శనివారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లాడన్నారు. వ్యవసాయ పొలానికి దగ్గరలోని చినిగేపల్లి చెరువు వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. మండలంలోని మరియంపూర్ గ్రామానికి చెందిన వీరభోసనోల్ల శంకర్ రాంరెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడి ఉండటాన్ని గమనించి రాంరెడ్డి మూడవ కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డికి ఫోన్‌లో విసయం తెలుపుగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని రాంరెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు రాంరెడ్డి భార్య చౌలా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా రాజశేఖర్ వివరించారు.

## తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి ఆగం చేశారు

-మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతిక అయిన తెలంగాణ తల్లి రూపాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మార్చి రాష్ట్రాన్ని ఆగమగం చేస్తూ తన కుటిల బుద్ధిని ప్రదర్శిస్తున్నాడని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే ఓ ప్రకటన విడుదల చేశారు. ఏకంగా తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి తెలంగాణ అమరవీరులకు, తెలంగాణ ఉద్యమ కారులకు అన్యాయం చేసినట్లయిందని విచారం వ్యక్తం చేశారు. చిల్లర చేష్టలతో రాష్ట్రాన్ని పాలిస్తే తెలంగాణ చరిత్రలో రేవంత్‌రెడ్డి విధ్వంసకారుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ మరో మారు అధికారంలోకి రావడం తథ్యమని శశిదర్‌రెడ్డి జోష్యం చెప్పారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

**టేక్మాల్,డిసెంబరు 7, ప్రభాతవార్త:** టేక్మాల్ మండల పరిధిలోని కాద్లూర్ గ్రామానికి చెందిన బుడ్డ బాగి మొగులయ్య అనే వ్యక్తి అకాల మరణం చెందాడు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గంగి రాజేందర్ స్పందించి వారి కుటుంబానికి 11వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. పెద్దదిక్కు కొల్పోయిన కుంటుబాన్ని ఆదుకోవడంపై గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ఈయన వెంట బుడ్డ బాగి రాజు, బక్క యాదయ్య, మారియారి ఎల్లయ్య, లక్ష్మయ్యలు పాల్గొన్నారు

## సామూహిక శ్రీమంతాలు



గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**రామాయంపేట, డిసెంబర్7,** ప్రభాతవార్త ః రామాయంపేట పట్టణంలోని అంగన్వాడీ సెంటర్ 12లో శనివారం నాడు గర్భిణీలకు ఘనంగా శ్రీమంతం, చిన్నారులకుఅన్నప్రాసనకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సృజన, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## అపరిశుభ్రతకు నిలయాలుగా రెస్టారెంట్‌లు



బిర్యానీలో బొద్దింక దర్శనం

**రామాయంపేట, డిసెంబర్** 7, ప్రభాతవార్త ః రామాయంపేట పట్టణంలో ఈ మధ్యకాలంలో హోటల్లలో పరిశుభ్రత లోపించింది. పట్టణంలో ఉన్న హోటల్ల యజమానులకు వ్యాపారంపైన తప్ప హోటల్లో పరిశుభ్రత పాటించాలన్న ఆలోచనలు రావడం లేదు. ఇందుకు తాజా ఉదాహరణ రామాయంపేట శివారులో బైపాస్ వద్ద ఉన్న ఆధ్య హోటల్‌లో మటన్ బిర్యానిలో బొద్దింక దర్శనం ఇచ్చింది. రామాయంపేట మండలం లోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన సార్గు రమేష్ శనివారం నాడు స్థానిక ఆధ్య రెస్టారెంట్‌లో మటన్ బిర్యాని ఆర్డర్‌చేసి భోజనం చేస్తుండగా మధ్యలో బొద్దింక వచ్చింది. దీంతో హోటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఇదేమిటని ప్రశ్నించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ల పర్యవేక్షణ లేకపోవడం వల్లే రెస్టారెంట్‌లో ఇలా అపరిశుభ్రమైన భోజనం వడ్డించి, కస్టమర్ల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని వారు మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



వీధి కుక్కుల దాడిలో గాయపడ్డ బాలుడు

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 7, ప్రభాతవార్త** ః రామాయంపేట మున్సిపాలిటీ 4వ వార్డులో పరిధిలోని బీసీ కాలనీలో బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. శనివారం నాడు బీసీ కాలనీలోని ఆరుబయట ఆడుకుంటున్న లక్కీ అనే 5 సంవత్సరాల బాలుడిపై ఒక్కసారిగా కుక్కల గుంపు దాడి చేయడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. దాడిని గమనించిన స్థానికులు వెంటనే కుక్కలను తరిమివేసి, బాలుడిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడిపై కుక్కలు దాడిచేసే సమయంలో అక్కడ ఎవరు లేకపోయిఉంటే బాలుడి ప్రాణమే పోయేదని బాలుడి తల్లి బోరున విలపించారు. కాగా ఇటీవల కాలంలో మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం చర్యలు తీసుకొని, కుక్కలను తరలించాలని స్థానికులు కోరారు.

### ఝరాసంగంలో సిఎం కప్ పోటీలు ప్రారంభం

**ఝరాసంగం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో శనివారం సిఎం కప్ గ్రామ స్థాయి పోటీలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, ఎంపిడిఓ సుధాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌లు హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామ స్థాయిలో పోటీలలో ప్రతిభ చాటిన క్రీడాకారులను మండల స్థాయి పోటీలలో తలపడేందుకు అవకాశం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తేనవతి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఏపిఓ రాజ్‌కుమార్, ఏపిఎం టిక్యానాయక్, వెంకటేశం, పంచాయితీ కార్యదర్శి సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాపన్నపేటలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ




పాపన్నపేటలో ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో విద్యను అందుకుని ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు రెగ్యూలర్ సర్టిఫికెట్లతో సమాన విలువలు ఉంటాయన్నారు. ఓపెన్ స్కూల్‌లో చేరడానికి ఈ నెల11వ తారీఖు వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ పాపన్నపేట అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రియాజ్ అహ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



విలేఖరులతో మాట్లాడుతున్న దృశ్యం

**టేక్మాల్,డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 15వ తేదిన సంతు సేవా లాల్ మహారాజ్ జయంతి సందర్భంగాసెలవు దినంగా ప్రకటించాలని బంజారా సేవాలాల్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో శనివారం మెదక్ జిల్లా బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్, ఉమ్మడి మెదక్ బంజారా సేవాలాల్ సంఘం ప్రచార కార్యదర్శి రాజు నాయక్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నాటికి శ్రీ సేవలాల్ మహారాజ్ 286 వ జయంతిని పురస్కరించుకుని సేవా లాల్ మహారాజ్ జయంతి పూర్తవుతుందని, దేశవ్యాప్తంగా 15 కోట్లకు పైగా గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సేవాలాల్ జయంతి సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షాట్ సర్క్యూట్‌లో కాలిపోయిన ఇల్లు, దుకాణ సముదాయాలు

**పాపన్నపేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** విద్యుత్ షాట్ సర్క్యూట్‌లో ఇల్లు, వ్యాపార సముదాయం కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని నార్సింగిలో శుక్రవారం రాత్రికి చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన కటికే అబెద్ మండల పరిధిలోని నార్సింగి-బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై చిన్న కటికే గృహం, వ్యాపార సముఉదాయాలు ఏర్పాటు చేసుకుని జీవనాన్ని సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఏడుపాయల్లో ఓ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు తన తల్లి, చెల్లిని ఇంట్లో ఉంచి కుటుంబ సభ్యులతో ఆబెద్ వెళ్లిపోయాడు. రాత్రికి విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఇల్లు, వ్యాపార సముదాయంలోని వస్తువులు, కొంత నగదు, బంగారం, వెండి అభరణాలు, గృహోపకరణాలు, బట్టలు, అంతా కాలిబూడిదయినట్లు బాధితుడు ఆబేద్ కన్నీరు కార్చాడు. అగ్ని ప్రమాదంలో 4లక్షల రూపాయల వరకు ఆస్థి నష్టం చోటు చేసుకుందిన ఆబేద్ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కటికే ఆబెద్ వినతి చేస్తున్నాడు.

## మల్గిలో ప్రారంభమైన మల్లన్న బోనాలు



మల్గిలో మల్లన్న బోనాల జాతరలో పూజలు చేస్తున్న భక్తులు

**న్యాల్‌కల్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్గి గ్రామంలో శనివారం మల్లన్న బోనాల జాతరను ఆలయంలో ఆలయ కమిటి అధ్యక్షులు, గ్రామ తాజీ మాజీ సర్పంచ్, మండల సర్పంచులు మాజీ ఉపాధ్యక్షులు బెట్గొండ మారుతి తన ధర్మపత్ని శిరీషతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. ఆలయంలో ఆలయ అర్చకులు సంగు వేద మంత్రాలు వల్లిస్తుండగా మారుతి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, డిసెంరు 7, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 2, 14వ వార్డులలో 20 కోట్ల టియుఐఎఫ్‌డిసి నిధులతో సిసి రోడ్లు, సిసి మురుగు కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకుపోయేలా ు ప్రతి కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మాస్తామన్నారు. పట్టణంలోని జూకల్ శివారులో గల ఫారెస్టులో అర్బన్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కింద 100 ఎకరాల్లో 5 కోట్ల నిధులతో అన్ని సౌకర్యాలు కలిగిన పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జగ్‌జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు వివేకానంద, రాజేష్, మాజిద్, నర్సింలు, హన్మండ్లు, సిద్దాం, రామకృష్ణ, అభిషేక్ శెట్కార్, తాహెర్, పండరిరెడ్డి, ముంతాజ్ సేట్, సత్యనారాయణ సేట్, శంకర్ ముదిరాజ్, యాదవరెడ్డి, అశోక్‌రెడ్డి, కట్టకింద సంజీవరెడ్డి, సత్యంసేట్, షారుఖాన్, సుబుర్, ఫాయాజ్, బొడ్డు అంజయ్య, శెట్టి శంకర్ పాటిల్, అంజయ్యముదిరాజ్, గోవర్ధన్ తదతరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయం

**సిర్గాపూర్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాకు కేటాయించిన నవోదయ విద్యాలయంను నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఆరుణ్‌రాజ్ కోరారు. రాష్ట్రానికి 7 నవోదయ విద్యాలయాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోది మంజూరు చేయడం ఆనందంగా ఉందని, విద్యాలయాలను మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బిజెపి నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని జగిత్యాల, భద్రాది కొత్తగూడెం, సూర్యాపేట, నిజామాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ జిల్లాలకు నవోదయ విద్యాలయాలను మంజూరు చేసినట్లు ఆరుణ్‌రాజ్ శేరికర్ వివరించారు. ఒక్కో విద్యాలయంలో47 మందికి ఉపాధి కల్పుతుందని, భారత దేశంలో మొత్తం 28 నావిధ విద్యాలయాల ద్వార 1316 మంది ప్రత్యక్షంగా ఉపాధి అందుకుంటారన్నారు. ఒక్కో పాఠశాలలో 560 మంది విద్యార్థుల చొప్పున 15680 మంది విద్యార్థులు విద్యను అందుకుంటారన్నారు.

## ప్రసన్నాంజనేయ స్వామికి మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక పూజలు

**నర్సాపూర్ డిసెంబర్ 7. ప్రభాతవార్త.** నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో మార్గశిర మాస శనివారం పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ గురుస్వామి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈ ఆలయంలో వేద పండితులు, ఆలయ పూజారి, గౌడిచర్ల హరి ప్రసాద్ శర్మ వేదమంత్రోచ్చరణల మధ్యప్రత్యేక పూజలు జరిగాయి ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ గురుస్వామి తో పాటు ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి సంజీవ్, కుమ్మరి జ్ఞానేశ్వర్, సదానందం, వెంకటచారి, పాముల రమేష్, నర్సింలు, గొల్ల సత్తయ్య యాదవ్, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## పార్టీల్ల బలోపేతానికి కృషి చేయాలి: జిల్లా బిజెపి అధ్యక్షుడు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గడ్డ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధి గవ్వలపల్లిలో మండల బిజెపి అధ్యక్షుడు పోగుల రాజు ఆధ్వర్యంలో శక్తి కేంద్రం కన్వినర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జి పంజా విజయ్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి శంకర్, మండల ప్రధాన కార్యదర్శి దశరథ్, స్థానిక భూత్ అధ్యక్షులు శివశంకర్, బిఖ్య, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల, రమేష్, చల్ల నవీన్, ఉడత సత్యనారాయణ ు పాల్గొన్నారు,

# దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు

**శ్రీ దత్తాత్రేయ, శ్రీ చండి యాగాలు**

**-15న శ్రీ దత్తాత్రేయ జయంతి దీక్షల విరమణ**

**ఝరాసంగం, డిసెంబరు7,** ప్రభాతవార్త: ఆధ్యాత్మకతప్రశాంతతకు నిలయమైన మండలం లోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమంలో ఈ నెల 8వ తారీఖు నుంచి శ్రీ దత్తాత్రేయజయంతి మహోత్సవాలు నిర్వహించే ందుకు ఆశ్రమాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. జయంతి ఉత్సవాలను పురష్క రించుకుని ప్రతి సంవత్సరం ఆయా గ్రామాలకు చెందిన భక్తులు శ్రీ దత్త దీక్షలు నిష్టనియమాలతో పాటిస్తూ ఉంటారు. మండల దీక్షను నవంబరు 3న, అర్ధ మండల దీక్షను నవంబరు 24వ తారీఖున భక్తులు స్వీకరించారు. సప్తహ దీక్షను డిసెంబరు 8వ తారీఖున స్వీకరించనున్నారు. దత్తాత్రేయజయంతి మహోత్సవాలను పురష్క రించుకుని ఈ నెల 8వ తారీఖున ఉదయం 8 గంటలకు శిఖరపూజ, ధ్వజారోహణంతో ఆరంభం అయ్యే శ్రీ దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు 17వ తారీఖు వరకు శ్రీ ఆనందగిరి మాత, నందిని మాతల పర్యవేక్షణలో కొనసాగుతాయని ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి 1008 అవదూత గిరి మహారాజ్ (అప్పగారు), శ్రీ డాక్టర్ మహంత్ సిద్దేశ్వరా నందగిరి మహారాజ్‌లు తెలిపారు. ఈ నెల 13, 14, 15వ తారీఖులలో శ్రీ దత్తాత్రేయ పాదపూజ, గోపూజ, సప్తభజన, గురుచరిత్ర పారాయణము, శ్రీ దత్తాత్రేయ హోమము (21 గుండములతో) గిరిశ్ జ్యోషి, పునీత్ కుమార్ దీక్షితులు, పరమేశ్వర శాస్త్రీల పర్యవేక్షణలో కొనసాగు తాయన్నారు. అనునిత్యం భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 15న శ్రీ దత్త యజ్ఞం, పూర్ణాహుతి, శ్రీ దత్తాత్రేయ డోలారోహణం, శ్రీ దత్తగిరి దీక్షల విరమణ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు 21600 దీపారాధన, ఆధ్యాత్మిక సభ, కీర్తనలు, భజనలు శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు సూర్య సింహసనాధీశ్వర చెన్న సిద్దారామ పండితారాధ్య శివచార్య మహా స్వామిజీ, శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు జ్ఞానసింహసనాదీశ్వర విశ్వారాధ్య శివచార్య మహా స్వామిలచే కొనసాగుతాయన్నారు. జయంతి మహోత్సవాల్లో భక్తులు పాల్గొన దత్తాత్రేయుల ఆశీస్సులు అందుకోవాలని ఆశ్రమ పీఠాధిపతులు భక్తులకు సూచించారు.

# బాలికకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

ఐదువేల రూపాయలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రామాయంపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** రామాయంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శనివారం నాడు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. రెండు రోజుల క్రితం హాస్టల్ భవనం పైనుండి పదవతరగతి విదార్థి కిందపడి గాయాలు కాగా పాఠశాలలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి బంధువులను పం ామ ర్శించారు. సుమారు 15 రోజుల పాటు బాలకను ఆసుపత్రిలో ఉంచి మెరు గైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రభాతవార్త విలేఖరికి ఫోన్ ద్వారా తెలిపారు. అంతే కాకుండా ఖర్చుల నిమిత్తం సుమారు 5 వేల రూపాయలు అంది ంచినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో బాలిక బాధ్యత తీసుకొని సరైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు హను మంతరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో కూరగాయలు, డైనింగ్‌హాల్‌లను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి వారు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, చింతలస్వామి పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులుగా ఖమ్మం రమేష్



అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గం

**కోహెడ, డిసెంబరు 7, ప్రభాతవార్త :** కోహెడ మండల అయ్యప్ప సేవ సమితి నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అయ్యప్ప గురుస్వామి ఖమ్మం రమేష్, ఉపాధ్యక్షులుగా మంద వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా కొండబత్తిని సతీష్, కార్యదర్శిగా అమ్ముల ఉపేందర్, కోశాధికారిగా వడ్డెపల్లి ప్రశాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ త్వరలోనే మండల కేంద్రంలో అనువైన స్థలం సేకరించి అయ్యప్ప ఆలయ నిర్మాణం చేపట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు

## సిఎం రేవంత్‌రెడ్డి కళ్ళు మూసుకొని పాలన సాగిస్తున్నారు

మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు: ఉమేష్‌చంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, డిసెంబరు 7, ప్రభాతవార్త :** దేవత రూపాన్ని పోలి ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చి మానవ రూపంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణకు అవమానకరమని చిన్నకోడూరు మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కాముని ఉమేష్‌చంద్ర అన్నారు. చిన్నకోడూరు శనివారం మండల పార్టీ అధ్యక్షుల కాముని శ్రీనివాస్, సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారం రాగానే సిఎం రేవంత్‌రెడ్డి కళ్ళు మూసుకొని రాక్షస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత తెలంగాణ ప్రజలు మురిసిపోయేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సిఎం రేవంత్‌రెడ్డి అధికారం అడ్డుపెట్టుకొని తెలంగాణ గౌరవప్రదమైన బతుకమ్మ తీసి వేయడమే కాకుండా తెలంగాణ రాచరికన్ని సూచించే కిరీటాన్ని తొలగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తును సూచించేలా కేవలం హస్తం మాత్రమే ఉంచడం ఇది హేయమైన చర్య అన్నారు. వేములవాడ క్షేత్రంలో ఉన్న కోడెలను అధికారం అడ్డుపెట్టుకొని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అనుచరుడు గోశాల పేరుతో 60 కోడెలు తీసుకుపోయి నిర్దాక్షిణ్యంగా కోతకు అమ్ముకుంటే తూతూ మంత్రంగా కేసు చేసి వదులుకున్నారని ఆరోపించారు. మంత్రి కొండా సురేఖపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి సాగిస్తున్నా రాక్షస పాలనకు ప్రజలే సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు మన్నె అనంద్, గొల్లపల్లి రాజశేఖర్‌రెడ్డి, తీగుల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**చేర్యాల, డిసెంబరు 7, ప్రభాతవార్త:** చేర్యాల పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్దలతో అత్యంత అంగరంగ వైభంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటి అధ్యక్షులు తాటిపెల్లి శకుంతల-ఆంజనేయులు గుప్త ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని కనుల పండుగ నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం స్వామికి పట్టాభిషేకం నిర్వహించి నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అంతకు ముందు స్వామివార్ల మూల విరాట్లకుప్రత్యేక పూజలు, ఆలయఆవరణలోమోమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాధాలతో పాటు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటి నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన అవసరం





న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

**జహీరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** విద్యార్థులు చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందని సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని మాణిక్ ప్రభు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి సూరి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో, సమాచార హక్కు, మోటారు వాహనాల, బాలకార్మిక నిర్యూలన, బాల్య వివాహాల నిరోధక, జువైనైల్ జస్టీస్ యాక్ట్, చట్టాలు, ఉచిత న్యాయ సేవా సహాయంలపై విద్యార్థులకు వివరించారు. క్రమ శిక్షణతో విద్యను ఆర్జిస్తే భవిష్యత్తు బంగారు మయంగా ఉంటుందన్నారు. బాల్య వివాహాలు జరిగితే, బాల కార్మికులు పనులు చేస్తూ ఉంటే తహసీల్దార్, పోలీసులు, మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయం దృష్టికి, 1098కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గపాల్, న్యాయవాదులు రుద్రయ్యస్వామి, రాఘవేందర్ నాయక్, పాఠశాల కరస్పాండెంట్ మారెల్లి వెంకటయ్య, ప్రిన్సిపల్ మధుసూదన్, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని వైశ్యులకు కేటాయించాలి

**రామాయంపేట, డిసెంబర్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి తమ వంతు కృషి, సహకారం ఉందని, అందువల్ల రామాయంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తమ వర్గానికి కేటాయించాలని స్థానికంగా ఉన్న వైశ్యులు కోరుతున్నారు.

ఈ మేరకు పలువురు వైశ్య సోదరులు ఇటీవల మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇంటికి వెళ్లి తమ వర్గానికి చెందిన ఎనిశెట్టి అశోక్ గుప్తాకు వైస్ చైర్మెన్ పదవి ఇవ్వాలని కోరారు. కాగా రాష్ట్రంలో పలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండడంతో ఇక్కడ కార్యకర్తల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. రిజర్వేషన్‌లో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మెన్ పదవి ఎస్టీలకు కేటా యించారు. అలాగే వైస్ చైర్మెన్ పదవి జనరల్‌కు దక్కింది. రెండు పదవులకు పోటాపోటీ నెలకొనడంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హను మంతరావు ఏ నిర్ణయం తీసుకోలేక పోతున్నారని సమాచారం. పార్టీ నాయ కుడు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి చైర్మెన్ పదవికి ఒకే పేరును ప్రతిపాదిస్తూ తన వద్దకు రావాలని హను మంతరావు కార్య కర్తలకు సూచించారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఈసారి చిన్న శంకరంపేట మండలానికి దక్కనుంది. ఏది ఏమైనా వైస్ చైర్మెన్ పదవి మాత్రం వైశ్యులకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే హను మంతరావుపై వైశ్య మహాసభ నాయకులు ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలుస్తుంది. అందులో భాగంగానే యువకుడు, ఉత్సాహ వంతుడు అశోక్ గుప్తాకు వైస్ చైర్మెన్ ఇవ్వాలని పలువురు వైశ్య సోదరులు కోరుతున్నారు. అయితే అశోక్ గతంలో టీఆర్ఎస్ పార్టీలో కొనసాగగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గెలుపుకోసం ఆయన నిర్విరామంగా కృషి చేశారు. చైర్మెన్, వైస్ చైర్మెన్ పదువులు ఎవరిని వరిస్తాయో వేచి చూడాల్సిందే మరి...



ఫోటో 3 : రామాయంపేటలో ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

## అంబేద్కర్ భవన్‌లో 25 ఫ్యాన్‌ల ఏర్పాటు

-వెన్నవరం ఆదర్శ్‌రెడ్డికి అభినందన వెల్లువ



ఫ్యాన్‌లను ఏర్పాటు చేయిస్తున్న బిఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ భవన్‌లో బిఆర్ఎస్ నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి తన నిధులతో 25 ఫ్యాన్‌లను శనివారం ఏర్పాటు చేయించారు. గతంలో అంబేద్కర్ భవన్ వారికి ఆదర్శ్‌రెడ్డి ఫ్యాన్‌లను ఏర్పాటు చేయిస్తానని చేసిన హామీ మేరకు శనివారం భవన్‌లో ఏర్పాటు చేసన 25 ఫ్యాన్‌లను స్విచ్ ఆన్ చేసి ఫ్యాన్‌లను ప్రారంభించారు. ఆదర్శ్‌రెడ్డి అంబేద్కర్ భవన్‌లో ఫ్యాన్‌లు ఏర్పాటు చేయడం పట్ల అంబేద్కర్ భవన్ బాద్యులు సంతోషం వ్యక్తం చేస్తూ అదర్శ్‌రెడ్డి సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ నాయకులు నరసింహ, క్రాంతి, బల్ల నర్సింగ్ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ క్రికెట్ కప్‌ను ప్రారంభించిన ఆదర్శ్‌రెడ్డి



కెసిఆర్ క్రికెట్ కప్ పోటీలను ప్రారంభిస్తున్న బిఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపురంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు మాణిక్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కెసిఆర్ క్రికెట్ ట్రోపి అమీన్‌పూర్ లెవన్ క్రీడా పోటీలను బిఆర్ఎస్ నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి శనివారం ప్రారంబించారు. పోటీల్లో తలపడేందుకు చేరుకున్న క్రీడాకారులతో ఆదర్శ్‌రెడ్డి పరిచయం చేసుకుని ఆల్ ద బెస్ట్ చెప్పారు. క్రికిట్ టోర్నిలో 50 జట్లు పాల్గొంటున్నట్లు, టోర్ని విజేత జట్టుకు 1 లక్ష రూపాయల నగదు అందచేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా ఆదర్శ్‌రెడ్డి బ్యాటించ్ చేసి క్రీడాకారులను, నిర్వాహకులను ఉత్సాహ పర్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డివిజన్ కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రాపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

## థీమ్ పార్క్‌లో 15 లక్షలతో ప్లే ఆపేరేటర్స్ ఏర్పాటు

-కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



ప్లే ఆపేటర్స్‌లను ఏర్పాటు చేయిస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీలో థీమ్ పార్క్‌లక్ష చిన్నారులు ఆడుకునేందుకు 15 లక్షల రూపాయలతో ప్లే ఆపరేటర్స్‌లను శనివారం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఏర్పాటు చేయించారు. గతంలో జరిగిన బస్తీ దర్శన్‌లో కాలనీ వాసులు పార్క్‌లో ప్లే ఆపరేటర్‌ల ఏర్పాటుకు కార్పోరేటర్ దృష్టికి తేవడంతో స్పందించిన పుష్పనగేష్ శనివార ప్లే ఆపరేటర్స్‌లను ఏర్పాటు చేయించారు. పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులతో వాల్కేర్స్‌లతో కార్పోరేటర్ కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్, ప్రకాష్, వీరిశెట్టి, కుమ్మరి సత్యనారాయణ, అంజయ్య, చంద్రమౌళి, సంగప్ప, వంకర్, నాగేశ్వర్‌రావు, నాగరాజు, మురళి మనోహర్, శ్రీనివాస్ రాజు, బ్రహ్మరాజు, వీరేందర్, అప్పారావు, నారాయణ, వాసంతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరస్‌గుత్తిలో సిఎం కప్ పోటీలు ప్రారంభం





కరస్‌గుత్తిలో సిఎం కప్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామ స్థాయి సిఎం క్రీడా పోటీలను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పాటిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హిరమన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సచిన్ పాటిల్, హిరమన్‌లు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపిని క్రీడాకారులను మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అమ్రేష్, సునీల్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఓంకార్





స్టాఫ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

**దూళిమిట్ట, డిసెంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి స్టాఫ్ బాల్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ దూళిమిట్ట పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లా మాసాయిపేటలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్టాఫ్ బాల్ అండర్ 17 బాలుల సెలక్షన్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడని ఈనెల7 నుండి 9వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్టాఫ్ బాల్ పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

